AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


### డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తోట రాజశేఖర్



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఏడీఈ తోట రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదగిరిగుట్టలోని డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా తాజుద్దీన్ బాబా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గంలో తోట రాజశేఖర్‌కు చోటు లభించడంతో జిల్లా సంఘ నాయకులు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


2-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## జలాశయాలకు కొనసాగుతున్న వరద..

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు ఆయా ప్రాజెక్టుల గేట్లుఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు 16 గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 56,513 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. కాకతీయ కాలువకు, లక్ష్మి కాలువకు నీటివిడుదలను నిలిపేశారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేలు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1091.00 అడుగుల (80.501 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు..

నిజాంసాగర్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 33,910 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1404.62 అడుగుల (17.2 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.


## అర్ధరాత్రి తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఎలాంటి కారణం లేకుండా నగరంలో అర్ధరాత్రి పూట రోడ్లపై తిరుగుతున్న 40 మంది యువకులకు ఒకటో టౌన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశారు. ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. నగరంలోని హైమాద్‌పుర కాలనీ, ఇస్లాంపూర, ఎన్నారై కాలనీ, మాలపల్లి , కోజా కాలనీ, అర్సపల్లి ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేశారు. ఎలాంటి కారణం లేకుండా రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ చేస్తున్న 40 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. యువకులతో పాటు వారి తల్లిదండ్రులను ఆదివారం ఉదయం స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరో ఇద్దరు యువకులు మద్యం తాగి న్యూసెన్స్ క్రియేట్ చేయడంతో కేసులు నమోదు చేశారు. అర్ధరాత్రి అనవసరంగా బయట తిరుగొద్దని సూచించారు. ఇతరకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం

**అక్షరటుడే, ఇందూరు:** బీసీ రిజర్వేషన్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుడు నరాల సుధాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని కళింగ భవన్‌లో ఆదివారం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించినట్లు తెలిపారు. బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దేవేందర్, బాలన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రజలను మోసం చేస్తున్నారు. జనరిక్ మందులను బ్రాండెడ్ మెడిసిన్ పేరిట విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభించే జనరిక్ ఔషధాలను అధిక ధరలకు అమ్ముతున్నారు. తనిఖీ చేయాల్సిన అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.
- అక్షరటుడే, కామారెడ్డి

- బ్రాండెడ్ పేరిట జనరిక్ మందుల విక్రయం
- తక్కువ ధర ఉన్నా రెండింతలకు అమ్ముతున్న వైనం
- నష్టపోతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

# మెడికల్ షాప్‌ల్లో మోసం!

జనరిక్ మందులు తక్కువ ధరకు లభిస్తాయి. వీటి వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వీటిపై అపోహలు వీడాలని, తక్కువ ధరలో లభించే ఈ మందులతో కూడా వ్యాధులు నయం అవుతాయని ప్రచారం చేస్తోంది. జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు ప్రోత్సాహం కూడా ఇస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటయ్యాయి. అయితే మిగతా మెడికల్ దుకాణాల్లో సైతం జనరిక్ మందులు విక్రయిస్తున్నారు. సాధారణ మెడికల్ షాపులలో అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

జనరిక్ మందులను ఇష్టానుసారంగా విక్రయాలు చేపడుతున్నారు. పలు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన మెడికల్ షాపులు, బయట ఏర్పాటు చేసిన మెడికల్ షాపుల్లో సగానికి పైగా జనరిక్ మందులనే అమ్ముతున్నారు. సాధారణంగా విక్రయించే మందులతో జనరిక్ మందులను కలిపి అదే కంపెనీ అంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. దాంతో ఏది జనరిక్, ఏది సాధారణ మందులో తెలియని ప్రజలు గుడ్డిగా నమ్మి మందులను తీసుకెళ్తున్నారు. జనరిక్ మందులు, సాధారణ మందులను గుర్తించడం సామాన్య ప్రజలకు చాలా కష్టం.

### ఎంఆర్‌పీ అధికంగా ఉండడంతో..

జనరిక్ మెడిసిన్ అంటే.. ఓ కంపెనీ సొంతంగా తయారు చేసిన ఫార్ములాతో ఇతర కంపెనీలు మందుతో తయారు చేసి విక్రయించడం. సాధారణంగా ఫార్మా సంస్థలు మందుల తయారు కోసం అనేక ప్రయోగాలు చేస్తాయి. దీని కోసం భారీగా ఖర్చు పెడతాయి. దీంతో ఏదైనా ఔషధం తయారు చేస్తే ఆ కంపెనీకి 20 ఏళ్ల వరకు హక్కులు ఉంటాయి. అప్పటి వరకు ఆ మందును ఇతరులు తయారు చేయడానికి వీలు లేదు. 20 ఏళ్ల తర్వాత ఆ ఫార్ములతో ఇతర ఫార్మా కంపెనీలు మందులు తయారు చేసే అవకాశం ఉంది. ఇలా తయారు చేసిన మందులను జనరిక్ ఔషధాలు అంటారు. ఇవి తక్కువ ధరలో లభిస్తాయి. అయితే ఎంఆర్‌పీ మాత్రం అధికంగా ఉంటుంది. జనరిక్ మెడికల్ దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే బాగా తక్కువ రేటుకు దీనిని విక్రయిస్తారు. మిగతా మెడికల్ షాపుల్లో మాత్రం ఎమ్మార్పీకి అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారు.

### రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా

జనరిక్ మందుల విక్రయాలను మెడికల్ మాఫియా వ్యాపారంగా మార్చుకుంది. జనరిక్ మందులను మెడికల్ షాపులకు తరలించి సాధారణ మందులతో పాటుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా మెడికల్ మాఫియా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కళకళలాడుతోంది. పట్టణంలోని దాదాపు సగానికి పైగా మెడికల్ షాపులను ఈ మాఫియా తన కంట్రోల్‌లో ఉంచుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఎవరైనా విక్రయించవచ్చు

మెడికల్ షాపులలో ఫలానా మందులే విక్రయించాలని నిబంధన లేదు. మా వద్ద నుంచి లైసెన్స్ తీసుకుని షాపు పెట్టుకున్న వ్యక్తి లైసెన్స్ ఉన్న ఏజెన్సీ నుంచి ఏ మందులైనా కొనుగోలు చేసి అమ్ముకోవచ్చు. జనరిక్ మందులు కూడా విక్రయించవచ్చు. ఒక్కో మెడికల్ షాపులో ఒక్కో విధంగా డిస్కౌంట్ ఇస్తారు. కొందరు డిస్కౌంట్ ఇవ్వరు. జనరిక్ మందులైనా, ఇతర మందులైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే మాత్రమే మేం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందుల ఎమ్మార్పీ తగ్గిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– రాజిరెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కామారెడ్డి

### తనిఖీలు కరువు

జనరిక్ మందులను ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణ అధికారులు ప్రతి నిత్యం తనిఖీలు చేపట్టి నాణ్యమైన మందులు విక్రయించేలా చర్యలు చేపట్టాల్సి ఉన్నా.. నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీలు చేపట్టే పరిస్థితులు లేవు. దాంతో మెడికల్ మాఫియా ఆడిందే ఆటగా సాగుతోంది. అధికారులు స్పందించి జనరిక్ మందుల విక్రయాలతో ప్రజలను మోసం చేస్తున్న మెడికల్ మాఫియాపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ సలహాదారును కలిసిన ట్రెసా జిల్లా నాయకులు

**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ, ఉద్యోగులకు సంబంధించి పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఉద్యోగులు, శాఖాపరమైన అంశాల్లో ట్రెసాకు తన మద్దతు ఎల్లవేళలా ఉంటుందని సుదర్శన్ రెడ్డి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, సభ్యులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**అక్షరటుడే, ఇందల్వాయి:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఏఎంసీ ఛైర్మన్ ముప్పా గంగారెడ్డితో కలిసి చేతి గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయన్నారు. ప్రచారంలో ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఐసీడీఎంఎస్ మాజీ ఛైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మోహన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ నరేశ్, మోపాల్ మండల యూత్ అధ్యక్షుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మోహన్, రవి, నరేష్, శ్రీను, నేల్ల శ్రీనివాస్, మల్లేష్, అనంత్, గంగాధర్ తదితరులున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొదిరె స్వామి, కుంట రమేశ్, నాగేంద్ర, కన్నె సురేందర్, పిట్ల శ్రీనివాస్, గట్టు సతీష్, శ్రీధర్, రాగుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యమెందుకు: పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** ఎండిన ధాన్యం కొనుగోళ్లలో జాప్యమెందుకు చేస్తున్నారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నించారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి శివారులో ఆదివారం వడ్ల కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మాయిశ్చర్ మిషన్ ద్వారా పోచారం తేమ శాతాన్ని పరిశీంచారు. 14 శాతం తేమ ఉన్నప్పటికీ ఎందుకు ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆయన నిర్వాహకులను అడిగారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. లారీలు అందుబాటులో లేని సమయంలో ట్రాక్టర్ల ద్వారానైనా మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయన ఆదేశించారు.



## ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లి ఉపనగర పథ సంచలన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మార్కండేయ మందిరం నుంచి ప్రారంభమైన పథ సంచలన్ అశోక్ వీధి, ఆర్య సమాజ్, పెద్ద బజార్ వరకు చేరుకుని తిరిగి గోల్ హనుమాన్ మార్కండేయ మందిరానికి చేరుకుంది. కార్యక్రమ సమయానికి జోరువాన కురిసినా.. స్వయం సేవకులు అలాగే ముందుకు సాగారు. కార్యక్రమంలో నగర కార్యవాహ సత్యం, ఉప కార్యవాహ వెంకటేష్, సుమిత్, జిల్లా వ్యవస్థ ఆర్మూర్ దత్తు, కాశ రామన్న, కోటగల్లి ఉపనగర కార్యవాహ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


లింగంపేట మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


బాన్సువాడ పట్టణంలో..

## సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. బాధ్యతాయుతమైన సీఎం పదవిలో ఉన్న ఓ వ్యక్తి ఇలా దేశ సైనికులు చేసిన సాహసాన్ని తక్కువ చేస్తూ మాట్లాడడం సరికాదన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


కోటగిరిలో ఆందోళన చేస్తున్న నాయకులు


కామారెడ్డిలో సీఎం చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

## శబరిమలకు అయ్యప్పస్వాముల పాదయాత్ర



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు పాదయాత్రగా శబరిమలకు వెళ్లారు. మండల కేంద్రంలోని సాయిబాబా సన్నిధానం ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోమాతను దర్శనం చేసుకుని పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ.. శబరిమల అయ్యప్ప సన్నిధానానికి 41 రోజులు పాదయాత్ర చేసి స్వామివారి సన్నిధానం చేరుకుంటారని తెలిపారు. మహిళలు మంగళ హారతులతో, జిల్లపల్లి చౌరస్తా వరకు సాగనంపారు. పాదయాత్రలో భాగంగా స్వాములకు డాక్టర్ సీతలే రమేష్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్‌లను అందజేశారు. వారి వెంట గురుస్వామి భాను, శంకర్, వినోద్, సంతోష్, అశోక్, గంగాధర్, అనిల్, రమేశ్, లక్ష్మణ్, మహిళలు, చిన్నపిల్లలు, గ్రామస్థులు తదితరులున్నారు.

## మోడల్ స్కూల్‌లో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని మామిడిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా స్కూల్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో చేస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమం విజయవంతంగా 27 వారాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్యామ్, ప్రేమ్, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, సుమన్, నరేందర్ ఆదిత్య, వేణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరికొయ్యలకు నిప్పు.. ప్రయాణికులకు ముప్పు

**అక్షరటుడే, కోటగిరి:** మండలంలోని కోటగిరి, రుద్రూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన పొలాల్లోని వరికొయ్యలకు ఆదివారం నిప్పుపెట్టారు. రోడ్డు వెంట ఉన్న గడ్డికి అంటుకొని భారీఎత్తున చుట్టుపక్కల వ్యాపించింది. అలాగే రోడ్డును కమ్మేసింది. దీంతో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతులు తమ పొలాలకు దగ్గరే రహదారి ఉన్న విషయాన్ని మరిచి ఇలా మంట పెట్టడం ఏమిటని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.


వర్షా నికి తడిసిన ధాన్యం

అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో కోతకు వచ్చిన పంటలు నేలవాలాయి. జంగంపల్లి కుర్దు, లక్ష్మాపూర్, రాంపూర్, కొట్టాల్ ప్రాంతంలోని రైతులు ఆయా ప్రాంతాలలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. భారీ వర్షం రావడంతో వరదకు వడ్లు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు వ్యయ ప్రయాసలు పడ్డారు. పంటలు ఇంటికి వచ్చే తరుణంలో తడిసి రంగు మారడంతో పాటు ముక్కిన వాసన వస్తున్నాయని వాపోయారు. వర్షా లకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. - అక్షరటుడే, ఎల్లారెడ్డి


ఆరబెట్టిన ధాన్యంలో చేరిన వర్షపు నీరు

# భారీ వర్షం.. కొట్టుకుపోయిన ధాన్యం


వర్షపు నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం





## క్రీడలతో క్రమశిక్షణ



**అక్షరటుడే, ఇందూరు:** క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఛైర్మన్ బస్వా లక్ష్మీ నర్సయ్య అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని బస్వా గార్డెన్‌లో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో నేర్చుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు ఆయన సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కోచ్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కలగుట్ట శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5న నుంచి 7 వరకు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5న పెర్కిట్ గ్రామంలోని శివాలయం నుంచి విగ్రహాల ఊరేగింపు, గణపతి పూజ పుణ్య హవచనం, 6న గణపతి పూజ, మూలమంత్ర వచనం, కుంకుమార్చన, 7న పుణ్యహవచనం, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బలిహరణం, మహా పూర్ణాహుతి, కుంబాభిషేకం అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విగ్రహప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



## చోరీ సొత్తు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

### 48 గంటల్లో కేసు ఛేదించిన వన్ టౌన్ పోలీసులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దొంగలించిన సొమ్మును విక్రయించేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని కోజా కాలనీకి చెందిన అతర్ బైగ్(21), షేక్ అజ్మాద్ (24) చెడు అలవాట్లకు బానిసలుగా మారారు. ఈ క్రమంలో జల్సాలకు డబ్బు సరిపోవడం లేదని ఒంటరిగా కనిపించిన వారిని బెదిరించి దారి దోపిడీకి పాల్పడడం, ఇళ్లలో చోరీలకు పాల్పడేవారు. ఇందులో భాగంగానే గత నెల 31న ఎరుకలవాడలోని ఓ ఇంట్లో బీరువా పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు, సెల్ ఫోన్ అపహరించుకుని పారిపోయారు. చోరీ సొత్తును అమ్మేందుకు ఆదివారం గంజ్ మార్కెట్‌లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద నుంచి బంగారు ముక్కు పుడక, ఉంగరం, వెండి కడియాలు, ఒత్తులు, స్మార్ట్ ఫోన్ , రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై ఇదివరకే చోరీ, హత్యాయత్నం కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. అతర్ బైగ్ నెలన్నర క్రితమే జైలు నుంచి బయటకు వచ్చారు. కాగా.. కేసును ఛేదించడంలో ముఖ్య పాత్ర వహించిన వన్ టౌన్ ఎస్సై జి మహేష్, ఏఎస్సై షకీల్, కానిస్టేబుల్ గంగారాం, ప్రభురాజ్‌ను ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.




## యజమానికి వర్కర్ల బురిడీ..
## 77 కిలోల వెండి చోరీ


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నమ్మకంగా పనిచేస్తున్నట్లుగా నటించి ఇద్దరు వర్కర్లు తమ యజమానినే మోసం చేశారు. తాము పనిచేసిన సిల్వర్ మర్చంట్ వద్దే ఏకంగా 77 కిలోల వెండిని చోరీ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కిషన్‌గంజ్ సమీపంలో ఉన్న శ్రీసాయి గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్‌లో విష్ణువర్ధన్, ప్రశాంత్ మూడేళ్లుగా పనిచేస్తున్నారు. అయితే యజమాని దుకాణానికే కన్నం వేసేందుకు ప్రణాళిక వేశారు. దీంట్లో భాగంగా విడతల వారీగా వెండిని చోరీ చేస్తూ వచ్చారు. అనుమానం వచ్చిన షాప్ యజమాని శివకుమార్ పాటిల్ ఇద్దరు వర్కర్లను వెండి దొంగిలిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మొత్తం 77 కిలోల వెండిని వారు చోరీ చేసినట్లుగా గుర్తించారు. వెంటనే బాధితుడు శివకుమార్ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో వివరించారు.



## 'తప్పుడు కేసు బనాయించాలని చూస్తున్నారు'

**అక్షరటుడే, ఇందూరు:** తమపై యజమాని తప్పుడు కేసు బనాయించాలని చూస్తున్నారని నగరంలోని గాంధీగంజ్‌లో గల సిల్వర్ మర్చంట్‌లో పనిచేస్తున్న కన్నయ్య, ప్రశాంత్ అనే యువకులు ఆరోపించారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా అదే సిల్వర్ మర్చంట్‌లో పని చేస్తున్నామన్నారు. వేతనం పెంచాలని, లేకపోతే వెళ్లిపోతామని యజమానులకు చెప్పామన్నారు. అయితే యజమానులైన అన్నదమ్ముల మధ్య వ్యక్తిగత విభేదాలు, దొంగ బంగారం కేసు ఉండడంతో ఇదే అదునుగా తమని తప్పుడు కేసులో ఇరికించాలని యత్నిస్తున్నట్లు వాపోయారు. 70 కేజీల వెండి దొంగతనం చేసినట్లు కావాలని ఇరికించారని, దుకాణంలో సీసీ కెమెరాలు పరిశీలించాలని కోరారు. గత నెల 9న గొడవ జరగగా, రాత్రి తమని యజమానులు కొట్టారని, అంతేగాక తెల్ల కాగితంపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. తమ బైక్, మూడు సెల్‌ఫోన్లు దౌర్జన్యంగా లాక్కున్నారని తెలిపారు. తాము ఎక్కడికి పారిపోమని, పోలీసులకు సహకరిస్తామని చెప్పారు. తమ పిల్లలకు ఏదైనా జరిగితే షాప్ యజమానులే బాధ్యత వహించాలని యువకుల తల్లిదండ్రులు వాపోయారు.

## గ్యాస్ కట్టర్‌తో సూపర్ మార్కెట్ తాళాలు ధ్వంసం..



**అక్షరటుడే, బోధన్ :** రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో ఎంఎస్‌ఆర్ సూపర్ మార్కెట్‌లో దొంగలు చోరీకి యత్నించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సూపర్ మార్కెట్ వద్దకు చేరుకున్న దొంగలు గ్యాస్ కట్టర్‌తో తాళాలు కట్ చేశారు. సూపర్ మార్కెట్ ఓనర్ పాష ఆ సమయంలో లోపలే ఉన్నారు. అలికిడికి ఆయన నిద్ర లేచి కేకలు పెట్టాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందిండాడు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి వచ్చే లోపు దొంగలు పారిపోయారు. గ్యాస్ కట్టర్ అక్కడే వదిలిపెట్టి తప్పించుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెంజల్ ఎస్సై